క్లుప్తంగా

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



క్రికెట్‌లో గెలుపొందిన గార్లదిన్నె జట్టు

శింగనమల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సహంగా కొనసాగాయి. క్రికెట్ పోటీల్లో గార్లదిన్నె, బుక్కరాయసముద్రం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో గార్లదిన్నె జట్టు విజయం సాధించింది. మూడవ స్థానంలో యల్లనూరు మండలం నిలిచిందని ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. నియోజకవర్గంలోని పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు మండల మీట్

పామిడి: ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్ శనివారం తెలిపారు. ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన వ్యవసాయం, రెవెన్యూ, వైద్యం, ఆరోగ్యం, విద్య, తాగునీరు వంటి తదితర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ



లైబ్రేరియన్‌కు పుస్తకాలు అందజేస్తున్న లెక్చరర్ రుక్మిణీ

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయానికి కేసీఎన్ డైట్ కాలేజీ లెక్చరర్ కె.రుక్మిణి దేవి 97 పుస్తకాలను అందజేశారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె యూజీసీ, నెట్, సెట్, బీఈడీ, పీ.జీ ఎంట్రెన్స్, ఇంగ్లిష్, పోటీపరీక్షల పుస్తకాలను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా లెక్చరర్‌ను ప్రిన్సిపాల్, లైబ్రేరియన్ జహరుల్లా అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

పెద్దవడుగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ రాముడు పేర్కొన్నారు. శనివారం కోనాపురం, రావులుడికి, భీమునిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

పేదలకు సాయం చేయడంలోనే దైవత్వం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సునీత, యోగి ముక్తేశ్వరి మాతాజీ

బుక్కరాయసముద్రం: నిరుపేదలకు సహాయం చేయడంలోనే దైవత్వం ఉందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం సంజీవపురం గ్రామంలో ఉన్న వెంకటరమణాచార్య గురువు చారిటబుల్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ట్రస్ట్ అధ్యక్షురాలు యోగి ముక్తేశ్వరి మాతాజీ మాట్లాడుతూ తోటి వారికి సాయపడే గుణం అలవర్చుకోవాలన్నారు. దైవం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా అనేక ప్రజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, కోశాధికారి రామాంజనేయులు, మల్లికార్జున, నాగభూషణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్‌ఎంపీ మృతి



లలితానాయుడు(ఫైల్)

గుత్తి: పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ లలితా నాయుడు(56) శనివారం ఆకస్మికంగా మృతి చెందింది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఈమె గుత్తి, గుంతకల్లు, పామిడి, యాడికి, ప్యాపిలి, తుగ్గలి, పెద్దవడుగూరు మండలాల్లో వైద్య సేవలు అందించారు. ఆమె మృతి పట్ల ఆర్‌ఎంపీ అసోసియేషన్ నాయకులు, సభ్యులు సంతాపం ప్రకటించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

గుత్తి రూరల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు పాటుపడాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల్లో ఆయా శాఖల్లో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలను అధికారులు వివరించారు. కరిడికొండ పంచాయతీలోని బాచుపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా స్థాయిని పెంచాలని సర్పంచ్ రమేష్‌బాబు అధికారులను కోరారు. ఊబిచెర్లలో తాగునీటి సమస్య అధికంగా ఉందని పరిష్కరించాలని సర్పంచ్ చిదంబరి విన్నవించారు. దీంతోపాటు పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తెచ్చారు. పట్టణ ప్రాంతాలలో ఆర్టీసీ బస్సులను వేగంగా నడుతుతూ వాహనదారులను ఢీకొడుతూ ప్రాణాలను తీస్తున్నారని వేగ నియంత్రణ పాటించాలని ఎంపీపీ విశాలాక్షి ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏఓ ముస్తాక్ అహ్మద్, హెచ్‌ఓ మిత్రవింద మాధవి, ఎంఈఓ రవినాయక్, సర్పంచ్‌లు చిదంబరి, సుశీలమ్మ, అప్పా వెంకటేష్, రమేష్, రాజేశ్వరి, వాసుదేవ రెడ్డి, చిన్న ఆంజనేయులు, ఎంపీటీసీలు చిన్న వీరన్నగౌడ్, సుమలత, శంకరమ్మ, కార్యదర్శులు ధనలక్ష్మి, ప్రవీణ్, సీడీపీఓ ఢిల్లేశ్వరి, సూపర్‌వైజర్ ప్రియాంక, ఇరిగేషన్ ఏఈ గురుప్రసాద్, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు, చిత్రంలో ఎంపీపీ విశాలాక్షి

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరిస్తాం

గుత్తి: లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరిస్తామని గుంతకల్లు డీఆర్‌ఎం వినీత్‌సింగ్ పేర్కొన్నారు. గుత్తి ఆర్‌ఎస్‌లోని రన్నింగ్ రూమ్‌లో రన్నింగ్ స్టాఫ్(లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు) వారి కుటుంబ సభ్యులతో శనివారం డీఆర్‌ఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన రన్నింగ్ స్టాఫ్, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రన్నింగ్ స్టాఫ్‌కు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బాక్సన్ డిపోను సందర్శించారు. తదనంతరం రైల్వే ఆసుపత్రిని తనిఖీ చేశారు. అంబులెన్స్, ల్యాబ్ ఏర్పాటుతోపాటు గైనకాలజిస్ట్, చిన్న పిల్లల డాక్టర్‌ను నియమించాలని ఆసుపత్రి వర్గాలు, రైల్వే యూనియన్ నాయకులు డీఆర్‌ఎంకు విన్నవించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ చౌహాన్, సీనియర్ డీఈ వీరయ్య, సీనియర్ డీఎంఈ రమేష్, డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రన్నింగ్ స్టాఫ్‌కు బహుమతి అందిస్తున్న డీఆర్‌ఎం వినీత్ సింగ్

అవ్వా..మరోసారి అవకాశం ఇవ్వండి

తాడిపత్రి అర్బన్: ప్రతి నెలా ఒకటో తారీఖున ఠంచనుగా పింఛన్ అందిస్తూ అవ్వా,తాతలకు పెద్ద కొడుకులా ఉన్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మరొకసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి వృద్ధురాలిని కోరారు. శనివారం ఆయన 31వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు సూర్యప్రభాకర్‌బాబు, పేరం ప్రతాప్‌రెడ్డి, ఆది తదితరులు ఉన్నారు.

మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి అన్నారు. ఊరిచింతల, తలారిచెరువు మధ్య ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీలోని నివాస సముదాయల్లో ఆయన శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం పడిన ఇబ్బందులను గుర్తు చేశారు. పేదల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మరోసారి జగనన్నకు ఓటు వేసి సంక్షేమ పథకాలను కొనసాగించుకుందామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, సర్పంచ్ హనుమంతరెడ్డి, ఊరిచింతల జనార్దన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డి, హరినాథరెడ్డి, సంజీవరెడ్డి, అమర్‌నాథరెడ్డి, చిన్నారెడ్డి, శంకర్‌గౌడ్, ఆర్‌సీ చంద్రఓబులరెడ్డి, సురేంద్రరెడ్డి, ప్రభాకర్, గౌస్, బాకర్‌వలి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో ఫ్యాను గుర్తుకు ఓటేయాలని వృద్ధురాలిని కోరుతున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు రక్ష

గుంతకల్లుటౌన్: ప్రజా ఆరోగ్య భద్రతే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న 28వ వార్డులో మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కంటి వైద్యపరీక్షలు చేయించుకున్న పలువురికి ప్రభుత్వం పంపిన కంటి అద్దాలను ఆమె అందజేశారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని ఆమె కోరారు. వార్డు సచివాలయ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం కౌన్సిల్‌హాల్‌లో ఏపీమాస్ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అనే అంశాలపై జిల్లా వాష్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆర్.లక్ష్మీదేవి మెప్మా ఆర్‌పీలకు అవగాహన కల్పించారు. శుద్ధమైన తాగునీరు, సక్రమమైన మరుగుదొడ్ల వాడకం, హ్యాండ్ వాష్ వల్ల అనారోగ్యాలు దరిచేరవన్నారు. శిక్షణ ద్వారా తెలుసుకున్న విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం.భవాని, ఏపీమాస్ కర్నూల్ కోఆర్డినేటర్ షణ్ముఖ, మెప్మా సీఓలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భారత రాజ్యాంగ అవగాహన వేదిక ఆధ్వర్యంలో చైర్‌పర్సన్, కమిషనర్, టీపీఆర్‌ఓలను ఘనంగా సన్మానించారు.



కంటి అద్దాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ భవాని

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుత్తి: విద్యార్థులు కేవలం చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ చదువు జ్ఞానాన్ని పెంచితే క్రీడలు ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తీరిక సమయాల్లో ఏదో ఒక క్రీడను ఆడాలన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముష్కిన్, మున్సిపల్ కౌన్సిలర్ బుసా రూపావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని లచ్చానపల్లి రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లుకు చెందిన పాత్రికేయుడు నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. నాగరాజు గుంతకల్లు నుంచి పనిమీద తమ అమ్మవారి ఊరైన లచ్చానపల్లికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఎదురుగా వాటర్ ట్యాంకర్ బైక్ ఢీ కొనింది. ప్రమాదంలో నాగరాజు వెన్నెముక విరిగింది. స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ



ఆటో డ్రైవర్లకు యూనిఫాం అందిస్తున్న గేట్స్ కళాశాల యాజమాన్యం

గుత్తి: గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ వ్యవస్థాపకుడు వీకే సుధీర్‌రెడ్డి 78వ జయంతి వేడుకలను శనివారం గేట్స్ యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. సుమారు 200 మందికి ఆటో డ్రైవర్లకు యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథ్‌రెడ్డి , డైరెక్టర్ వీకే వాణి మాట్లాడుతూ వీకే సుధీర్‌రెడ్డి విద్యారంగంతోపాటు నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన చేసిన సేవలు మనముందు కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గేట్స్ అధ్యాపకులు, విద్యార్థులు, ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యల్లనూరు ఎస్‌ఐగా గిరిబాబు

యల్లనూరు: యల్లనూరు ఎస్‌ఐగా గిరిబాబును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ ధరణీబాబును జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్ చేశారు. చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న గిరిబాబును ఇక్కడికి నియమించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు

యాడికి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని తాడిపత్రి డీఎస్పీ గంగయ్య హెచ్చరించారు. శనివారం మండలంలో సమస్యాత్మక గ్రామాలైన నిట్టూరు, గుడిపాడులో డీఎస్పీ పర్యటించారు. ఈసందర్భంగా రౌడీషీటర్ల ఇళ్లు, కల్లం దొడ్లను సోదా చేశారు. గుడిపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించి గ్రామంలో ఉన్న సమస్యలపై సచివాలయ సిబ్బందితో ఆరాతీశారు. అనంతరం ఆయా గ్రామాల్లో డీఎస్పీ గంగయ్య మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఎవరూ గొడవలకు పోకూడదని, గొడవలు సృష్టించే వ్యక్తులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలకు పాల్పడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అటువంటి వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో యాడికి సీఐ నాగార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నిట్టూరులో ప్రజలతో మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ గంగయ్య

అంకితభావంతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు



ఉత్తమ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం


గార్లదిన్నె: ఉద్యోగులు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకోవడంతో శనివారం పాఠశాలలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు ఎంఈఓ గురుప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం శారదాబాయ్, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, వేణుగోపాల్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ అలెగ్జాండర్‌ను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

తాడిపత్రిటౌన్: తాడిపత్రి తహసీల్దార్ అలెగ్జాండర్‌కు ఉత్తమ అవార్డు రావడంతో శనివారం రెవెన్యూ కార్యాలయ అధికారులు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. కార్యాలయ వర్గాలు ఆయన్ను శాలువాలు, పూలహారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది సహకారంతోనే ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అంజనప్రసాద్, సీఎస్‌డీటీ రాజారాం, ఆర్‌ఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు అభిషేకం



అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమల పాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కూలిన టీడీపీ కటౌట్



'రా కదలిరా' సభా వేదిక ఎదుట కటౌట్ కూలిన దృశ్యం

ఉరవకొండ: స్థానిక అనంతపురం బైపాస్ వద్ద టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రా కదలిరా సభ వేదిక వద్ద టీడీపీ నాయకులు కొందరు అత్యుత్సాహంగా ఏర్పాటు చేసిన రెండు భారీ చంద్రబాబు, పయ్యావుల కేశవ్ కటౌట్‌లు సభ ప్రారంభం కాకముందే కుప్పకూలాయి. కటౌట్‌లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన పలు ఫ్లెక్సీలు గాలికి ఎగిరిపోవడంతో తమ్ముళ్లు తీవ్ర నిరాశ చెందారు.

జేసీ సోదరులకు ఓట్లు అడిగే అర్హత లేదు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన జేసీ సోదరులు వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత కోల్పోయారని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2007లో జేసీ సోదరుల హయాంలోనే తాడిపత్రికి ఆర్‌టీఓ కార్యాలయం వస్తే ఇంత వరకు సొంత భవనం నిర్మించ లేక మార్కెట్ యార్డ్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో దాతల సహకారం తీసుకుని ఆర్‌టీఓ కార్యాలయానికి సొంత భవనం నిర్మిస్తుంటే అడుగడుగునా అడ్డు పడటమే కాకుండా కోర్టుల కెక్కి నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూశాడన్నారు. వారి విద్యావ్యాపారం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పట్టణానికి పది కిలో మీటర్ల దూరంలో నిర్మించి విద్యార్థుల ఇక్కట్లకు కారణమయ్యారన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి విద్యార్థుల రవాణా కోసం ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేసి వారి అవస్థలు దూరం చేశారన్నారు. జేసీ సోదరుల ఇంటి వద్ద ఉన్న ప్రభుత్వజూనియర్ కళాశాల ప్రహరీ నిర్మాణం జరగకుండా అడ్డుపడి కళాశాల మైదానాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తల అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మార్చుకున్నారన్నారు. పేద ముస్లిం విద్యార్థుల కోసం కేంద్రం ద్వారా వచ్చిన కళాశాలకు చిన్నపోలమడ వద్ద స్థలం కేటాయిస్తే దానిని అడ్డుకొవడానికి ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తూ మసీదుల వద్ద కరపత్రాలు వేయలేదా అంటు ప్రశ్నించారు. పేద ముస్లిం మైనారీల అభివృద్ధిని అడ్డుకొవడమే కాకుండా వారి పిల్లలకు విద్య అందకుండా ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గంగులకుంట కేశవరెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ ప్రభాకర్, వినోద్‌కుమార్, ఐటీ విభాగం నాయకులు జ్ఞానేశ్వర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

ఆర్జేడీని కలిసిన వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలపై విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) వెంకట కృష్ణారెడ్డిని కడప కార్యాలయంలో వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు శనివారం కలిశారు. ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె. ఓబుళపతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హెచ్. గిరిధర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా ప్రసాద్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి తదితరులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీల సమస్యలు పరిష్కరించారని, ఉపాధ్యాయుల సమస్యలూ పరిష్కరించాలని కోరారు. సర్వీస్ మ్యాటర్స్‌ను సకాలంలో పూర్తి చేసే విధంగా రీజనల్ పరిధిలోని జిల్లాల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ఓబుళపతి కోరారు. ఆర్జేడీ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డికి బొకే అందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతి, గిరిధర్‌రెడ్డి తదితరులు

సమన్వయంతో సమగ్రాభివృద్ధి సాధిద్దాం

అనంతపురం సిటీ: పరస్పర సహకారం, సమన్వయంతో పని చేసి ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పిలుపునిచ్చారు. జెడ్పీ సీఈఓగా నియమితులైన వైఖోమ్ నిదియాదేవి బాధ్యతలు చేపట్టాక శనివారం తొలిసారి జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, జిల్లాలో భౌగోళిక పరిస్థితులు, చేపట్టాల్సిన అభివృద్ధి, జెడ్పీ కార్యాలయ ప్రక్షాళన తదితర అంశాలపై చర్చించారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.కోట్లతో జరుగుతున్న పనులు గడువులోపు పూర్తి చేసి, ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారని గిరిజమ్మ తెలిపారు. రానున్న రోజులు కీలకం కావడంతో మరింత సమర్థవంతంగా పని చేసి, జిల్లాను అభివృద్ధి పరంగా అగ్రభాగాన నిలబెడదామని గిరిజమ్మ కోరారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈఓ నిదియాదేవి

ఆర్టీసీ స్థలాల లీజుపై 30న అవగాహన సదస్సు

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని స్థలాల లీజుపై ఈనెల 30న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎం కార్యాలయానికి ఉత్తర దిశగా ఉన్న ఖాళీ స్థలాన్ని 33 ఏళ్ల కాలపరిమితితో లీజుకు ఇవ్వడంపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 4,330 చదరపు గజాలు, 3,845 గజాలుగా రెండుగా విభజించినట్లు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరాలయానికి పెరిగిన ఆదాయం

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరాలయానికి గతంలో కన్నా టెంకాయల వేలంలో రూ. 24,500 అదనపు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రమేష్ బాబు అన్నారు. శనివారం స్థానిక మొదటి రోడ్డులోని శివాలయంలో దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. నగరానికి చెందిన డి.వెంకటరమణ అనే భక్తుడు వేలంలో అత్యధిక మొత్తం రూ.51 వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో కార్యనిర్వహణధికారి సాకే రమేష్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యుడు నీలూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అక్కదేవతల నామస్మరణ

కూడేరు: మండలంలోని అరవకూరులో నూతనంగా నిర్మించిన అక్కమ్మ దేవతల ఆలయంలో శనివారం అక్క దేవతల నామస్మరణ మార్మోగింది. అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట చేసి 41 రోజులు పూర్తి కావడంతో పురోహితులు పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం సుఖశాంతులతో సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ అంటూ గ్రామస్తులు అమ్మవార్లను వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.



అక్క దేవతలకు పూజలు నిర్వహించిన దృశ్యం